క్లుప్తంగా

బిక్కవోలు ఎంపీడీవోగా శ్రీనివాస్


బిక్కవోలు ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఎంపీడీవోగా వి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం నుంచి ఇక్కడికి వచ్చారు.ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో జె.ఎ.ఝాన్సీ రాజానగరానికి బదిలీ వెళ్లడంతో ఆమె స్థానంలో శ్రీనివాస్ వచ్చారు.

అన్న సమారాధన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం వెలమపేటలోని రామాలయం వద్ద సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. దసరా సందర్భంగా ఇక్కడ అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 16వ తేదీన అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా గ్రామంలో ఊరేగించి వంగలపూడి రేవు వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ నేపథ్యంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ సహకారాలతో అన్న సమారాధన జరిపారు. సుమారు రెండు వేల మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

బోల్తా పడిన వ్యాన్

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఓ వ్యాన్ సోమవారం అదుపు తప్పి పొలంలోకి బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. రాయవరం గ్రామంలోని రైసుమిల్లుకు చెందిన వ్యాన్ పందలపాక మీదగా కాకినాడ వెళుతుంది. పందలపాక గ్రామ శివారులో తుప్పల నుంచి గేదె ఒక్కసారిగా రోడ్డు మీదుకు వచ్చింది. ఈ నేపథ్యంలో వ్యాన్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలంలోకి పల్టీ కొట్టింది. అదృష్టవశాత్తూ ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

189 మందికి వైద్య సేవలు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో ఉసోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 189 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రోజా, ఆశావర్కర్లు సాయి, వెంకటలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి యూనిట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్ పాయింట్‌ను బిక్కవోలు పోలీసుస్టేషన్ వద్ద సోమవారం ఏర్పాటు చేసినట్టు ప్రకృతి వ్యవసాయ ఎల్‌టూ గుబ్బల ఈశ్వర్ కుమార్ తెలిపారు. ఐసీఆర్‌పీలు పండించిన కూరగాయలు, ఆకు కూరలు,బియ్యం, పండ్లను విక్రయించడంతో పాటు ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈశ్వర కుమార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ఈ పాయింట్ ద్వార ప్రజలు ఆరోగ్యకరమైన కూరగాయలు,పండ్లు విక్రయించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలోని ఐసీఆర్‌పీలు పైల వెంకటలక్ష్మి, జి.శ్రీలక్ష్మి,జి.మాధవి,ఎ.లక్ష్మీకుమారి, జి.సత్యవేణి, ఎం,సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతల స్వీకరణ


రొంగల శ్రీలక్ష్మి


టైకుముడి రోజా

బిక్కవోలు: బిక్కవోలు సచివాలయంలో గ్రేడ్ 5 కార్యదర్శిగా సేవలు అందించిన రొంగల శ్రీలక్ష్మి పందలపాక గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, టైకుముడి రోజా బిక్కవోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విధి విధానాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

పురాతన నాణేలు, కరెన్సీ ప్రదర్శన


జి.మామిడాడలో పురాతన నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

పెదపూడి: విద్యార్థుల్లో ఆలోచనా శక్తి , సమాజం పట్ల అవగాహన పెంచడానికి పురాతన నాణేలు, కరెన్సీ ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో సి.వి.వి.సత్యనారాయణ అన్నారు. జి.మామిడాడలో పీఎం శ్రీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం పురాతన నాణేలు, విదేశీ, స్వదేశీ కరెన్సీ నోట్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ లంక మున్ని ప్రారంభించారు. ప్రదర్శనను సందర్శించిన ఎంఈవో సత్యనారాయణ నిర్వాహకులను అభినందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడు కొక్కిర సుధాకర్‌బాబు దీనిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోరాడ శ్రీనివాస్, ఉపాధ్యాయుడు తిర్రి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, ఎన్డీఏ నాయకులు తమలంపూడి శివరామారెడ్డి, జుత్తక కృష్ణ, రావడ నాగు, ఛత్రపతి శివాజీ, గోపిరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతతో ఆనందం

- టపాసుల విషయంలో అజాగ్రత్త వద్దు
- ప్రజలకు అధికారుల సూచనలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న దీపావళి బాణసంచా

బిక్కవోలు: చిన్నా,పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే దీపావళి పండగకు కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉంది. ఈ నెల 31న జరిగే దీపావళి నాడు అందరూ కొత్త దుస్తులు ధరించి, బాణసంచా కాలుస్తూ ఆనంద డోలికల్లో ఓలలాడుతారు. అయితే ఆ వెలుగుల మాటున ప్రమాదం పొంచి ఉంటుంది, అందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఆనంద దీపావళి అవుతుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్టే. బాణసంచా కాల్చే సమయంలో తప్పని సరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాలు,గడ్డివాములు,పూరిగుడిసెలు అధికంగా ఉంటాయి. అటువంటి ప్రాంత్రాల్లో రాకెట్లు,చిచ్చుబుడ్లు,తారాజువ్వలు వంటివి కాల్చరాదు.
- పండగ ఆనందంలో పిల్లల పట్ల ఏమాత్రం అజాగ్రత్త వహించినా జీవిత కాలం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు.
- టపాకాయల పనితీరు, వెలిగించాల్సిన విధానం తదితరు అంశాలపై వారికి అర్ధమయ్యేలా తెలపాలి.సాధ్యమైనంత వరకూ పెద్దల పర్యవేక్షణలో పిల్లలతో టపాసులు కాల్పించాలి.
- కొంతమంది కొన్నిరకాల టపాసులను రోడ్లపై పేల్చేందుకు ప్రయత్నిస్తారు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇరుకు ప్రాంతాల్లో ఉండే సీసీ రోడ్లలో ఈ విధమైన ప్రమాదాలు అధికంగా జరిగే వీలుంటుంది. అందుచేత వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యేలా రహదారులపై టపాసులను వెలిగించరాదు.

వ్యాపారులు పాటించాల్సిన నియమాలు

- జన సంచారం లేని,ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేయాలి.
- అనుకోని ప్రమాదాలు తలెత్తినపుడు వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా విశాలమైన మార్గం ఉంటే మంటలను త్వరగా అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బందికి అనువుగా ఉంటుంది.
- టపాకాయలు విక్రయించే వ్యాపారులు మొదటిగా పోలీసు,రెవెన్యూ,అగ్నిమాపక,పంచాయతీ,విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాలి.
- విక్రయ ప్రాంతంలో విధిగా ఇసుక, నీరు,కార్బన్ డయాక్సైడ్ వాయువును అందుబాటులో ఉంచుకోవాలి.
- దుకాణాల సమీపంలో ఎవరూ సిగిరెట్లు,బీడీలు కాల్చకుండా పొగ తాగరాదు అని బోర్డులను ఏర్పాటు చేయాలి.
- సెల్‌ఫోన్‌లో మాట్లడకుండా చర్యలు తీసుకోవాలి.దుకాణల మధ్య కనీసం పది అడుగుల దూరంగా ఉండేలా చూడాలి.
- మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రాల్లో విద్యుత్‌కు సంబంధించిన వైరింగు సక్రమంగా ఉండేలా జాగ్రత్త వహించడంతో పాటు సాధ్యమైనంత వరకూ ఎల్‌ఈడీ బల్బులు వాడడం మంచిది.
- తనిఖీలు నిర్వహించే సమయంలో రెవెన్యూ,పోలీసు,అగ్నిమాపక ,పంచాయతీ అధికారులకు నిల్వల వివరాలను తెలిపేందుకు సహకరించాలి.
- ప్రతి దుకాణం ఎదుట టపాకాయల ధరల పట్టిక,అగ్ని మాపక కేంద్రాల ఫోన్ నంబర్లు తప్పకుండా ఉండాలి.

అనుమతులు తప్పనిసరి



టపాకాయలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.ఎక్కడైన అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవు

– కృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్, బిక్కవోలు

అప్రమత్తంగా వ్యవహరించాలి



ప్రమాదాలనేవి ప్రారంభంలో చిన్నవిగానే ఉంటాయి. అందుచేత అనుమానం రాగానే చుట్టు పక్కల ఉన్న వారు సైతం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న వనరులతో సాధ్యమైనంత వరకూ ప్రమాద నివారణకు ప్రయత్నించాలి.వెంటనే అగ్నిమాపక కేంద్రానికి లేదా 108లేదా పోలీసు స్టేషన్ సమాచారం అందించాలి.

– జి.శ్రీనివాస్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి ,అనపర్తి

నియోజకవర్గంలో: అనపర్తి నియోజక వర్గంలో బిక్కవోలులో రెండు,పందలపాక గ్రామంలో ఒకటి, బలభద్రపురంలో ఒకటి చొప్పున తయారీ కేంద్రాలు ఉన్నాయి.అలాగే తాత్కాలిక నియోజక వర్గంలో సుమారు 50 దుకాణాలు ఏర్పాటు అవుతాయని అధికారులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు సత్కారం రేపు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ నాయకులను బుధవారం సత్కరించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంద్ర వందిత్(రాజా), తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా నియమితులైన మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కురసాల కన్నబాబులకు అభినందలు తెలియజేస్తూ సత్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండాలల్లో పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనేతలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శనగ విత్తనాల పంపిణీ


కోటపాడులో శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: మండలంలోని కోటపాడు గ్రామంలో శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వడిశలేరులో 200, రంగంపేటలో 150, చంద్రేడులో 100, పెద రాయవరం గ్రామంలోని 200 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్టిఫైడ్ సీడ్‌ను 25 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల గోవిందు, నాయకులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థిని పల్లవి మృతికి సంతాపం


పల్లవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

రాజానగరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీజీ విద్యార్థిని కుంచె పల్లవి (27)కి సహ విద్యార్థులు, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని హుకుంపేట వరలక్ష్మి కాలనీకి చెందిన పల్లవి స్నేహితురాలితో కలిసి బైకుపై యూనివర్సిటీకి వస్తుండగా లాలాచెరువు వద్ద ఆర్టీసీ నాన్ స్టాప్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం యూనివర్సిటీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సంతాప సభ నిర్వహించారు. పల్లవి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ యూనివర్సిటీ ఒక మంచి విద్యార్థినిని కోల్పోయిందన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ నివాళులర్పించారు. రోడ్డుపై ప్రయాణాలు చేసే సమయంలో ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా బైకులపై ప్రయాణించేవారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా ప్రవక్త మహ్మద్ జీవితం ఆదర్శప్రాయం


మాట్లాడుతున్న మౌల్వీ మహ్మద్ సిరాజ్

సీతానగరం: మహా ప్రవక్త మహ్మద్ జీవితం ఆదర్శ ప్రాయమని కమ్యూనిటీ జిల్లా ఇన్‌చార్జి మౌల్వీ మహ్మద్ సిరాజ్ అన్నారు. వంగలపూడిలోని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మసీదులో సోమవారం సమావేశం నిర్వహించారు. కమ్యూనిటీ ఉపాధ్యక్షుడు షేక్ వజీరుద్దీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ సర్వమత అవతార పురుషులను గౌరవించుకున్నప్పుడే ప్రపంచంలో శాంతి నెలకొల్పవచ్చన్నారు. వంగలపూడి మసీదు గురువు మౌల్వీ మహ్మద్ అక్బర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ఎంతో క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని, మూడో ప్రపంచ యుద్ధం వైపునకు వేగంగా వెళుతోందన్నారు. మహ్మద్ ప్రవక్త ఇస్లాం అంటే శాంతి అని బోధించారని గుర్తు చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


రాపాకలో బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా


రాజానగరంలో వెంకట రమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలానికి చెందిన పలువురు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. సంపత్‌నగరంలో మెండి సుబ్బారావు, చిలకలపూడి రాజ్‌కుమార్, ఆదిమూలం దుర్గారావు, గెడ్డం జాహ్నవి, శేఖ లక్ష్మి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీకృష్ణపట్నంలో అన్నదేవుల గంగమ్మ, కొట్టి వెంకట్రావు, నందరాడలో అడుసుమిల్లి పాపాజీ చౌదరి, నల్లికొండ పార్వతి, బొడ్డు బంగారం, బొమ్మకంటి వెంకన్న కుటుంబాలను పరామర్శించారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. రాపాకలో బత్తిన మారమ్మ, మండ మీనాక్షమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీతానగరంలో కుమారుడిని కోల్పోయిన వెలుగుబంటి శ్రీనివాస్‌ను, పురుషోత్తపట్నం వెలిచేటి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను, రామచంద్రపురంలో బరకట్టి వెంకటగిరి కుటుంబంతో మాట్లాడారు. సింగవరంలో ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పరిమి వీర్రాజు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచ్ సమాఖ్య సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, చల్లమళ్ల సుజీరాజు, కోలా శ్రీను, ద్వారంపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సోదరుడి మృతి

రాజానగరం: గ్రామ మాజీ సర్పంచ్ కొల్లి నూకరాజు సోదరుడు కొల్లి వెంకట రమణ సోమవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇక్కడకు చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. మృతుడి మరో సోదరుడు, ప్రస్తుత ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అమరుల సేవలు మరువలేనివి


బిక్కవోలులో విద్యార్థులకు అమర వీరుల సేవలను వివరిస్తున్న ఎస్‌ఐ రవిచంద్ర కుమార్


బిక్కవోలు ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు


సీతానగరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై చక్రారెడ్డి


కోరుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, పోలీసులు

బిక్కవోలు: పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివని, వారి సేవలను గుర్తు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎస్‌ఐ వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర వీరులకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా స్థానిక శ్రీప్రజ్ఞా కళాశాల విద్యార్థులు, వివిధ శాఖ అధికారులతో కలిసి పోలీసుస్టేషన్ నుంచి బిక్కవోలు వంతెన వరకు ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ నిత్యం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ,పోలీసు సిబ్బంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో భారీ ర్యాలీ

మధురపూడి: అమరవీరుల స్ఫూర్తితో యువత దేశ రక్షణకు నడుం బిగించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. పోలీసు అమరవీరులను సంస్మరించుకుంటూ కోరుకొండలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు. సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో కాపవరం సెంటర్ నుంచి జాతీయ రహదారి మీదుగా బస్టాండ్ సెంటర్, లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వరకూ ర్యాలీ జరిపారు. తొలుత అమరులైన పోలీసుల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. కోరుకొండ జూనియర్ కాలేజీ, హైస్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

సీతానగరం: పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా పోలీసుల విధులపై పలు పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై డి.రామ్ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్సై చక్రారెడ్డి పోలీసుల విధులను వివరించారు. వైర్ లెస్ సెట్ పనిచేసే విధానం, ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, రివాల్వర్ పనితీరును వివరించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

పెదపూడి: అమరు వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్ అన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా అనపర్తిలో పోలీసులు సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

వెంకటరావు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్


అనపర్తిలో వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: కార్మికనేత, సీఐటీయూ ఐటీసీ వర్కర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత వాసంశెట్టి వెంకటరావు మరణం వైఎస్సార్‌సీపీకి తీరని లోటని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తికి చెందిన వెంకటరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని సోమవారం ఎంపీ సుభాష్ చంద్రబోస్, సూర్యనారాయణరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వెంకటరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్మిక సమస్యలపై పోరాడే నేతను కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి గ్రామ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్‌బాలకృష్ణారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వాసంశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రంగంపేట విద్యార్థుల ప్రతిభ


రంగంపేటలో విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులను ఆ పాఠశాల హెచ్‌ఎం, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వి.పార్థసారథి సోమవారం మాట్లాడుతూ అచ్యుత రామారావు చారిటబుల్ ట్రస్ట్ అండ్ సైన్స్ సెంటర్ హైదరాబార్ ఆధ్వర్యంలో పెద్దాపురంలో రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన, పోటీలు నిర్వహించారని చెప్పారు.ఈ పోటీల్లో తమ ప్రాఠశాల విద్యార్థులు ఎ.రమ్య, జె.సీతామహాలక్ష్మి ప్రదర్శించిన 'స్టూడెంట్స్ అటండెన్స్ డివైస్ విత్ ఫొటోకాప్చరింగ్ అండ్ ఫీడ్ బ్యాక్ మెకానిజం' అనే ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైనట్టు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను, వారి గైడ్ ఉపాధ్యాయుని వి.రమ్య సుధను అభినందించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు


నిందితుడు, రికవరీ చేసిన సొత్తుతో సీఐ సుమంత్, పోలీసులు

పెదపూడి: రెండు చోరీ కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేశామని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. అనపర్తిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనపర్తిలోని ఎంపీడీఓ ఆఫీస్ ఎదురుగా డి.వెంకట ప్రసాద్, వెంకటలక్ష్మి జ్యూవెలరీ వర్క్‌షాపులో గత నెల 28న, అలాగే కుతుకులూరు గ్రామంలోని పి.వెంకటరెడ్డి ఇంట్లో ఈనెల 10వ తేదీన బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో చోరీలకు పాల్పడిన రాయవరం మండలం వెదురుపాక రాయవరం గ్రామానికి చెందిన కట్టా శివ శంకర్‌ను ఈ నెల 20న అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 211 గ్రాముల వెండి, 12 గ్రాముల బంగారం ఆభరణాలు రికవరీ చేశారు. నిందితుడిపై సుమారు 50 వరకూ కేసులున్నట్టు వెల్లడించారు. అతడిని అరెస్ట్ చేసి అనపర్తి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించిందని, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

11 మంది పేకాట రాయుళ్లను పట్టుకున్న పోలీసులు

పెదపూడి: అనపర్తి ధరణికోట ప్రాంతంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,600 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం చేసిన దాడిలో టేబుల్, కుర్చీలు సీజ్ చేసి పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి, గాడాల, గుమ్ములూరు, బుచ్చెంపేట గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.17.25 కోట్లతో ముగుగునీటి కాలువల నిర్మాణం జరుగుతోందన్నారు.

దశల వారీగా సీసీ రోడ్ల నిర్మాణం

పెదపూడి: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దశల వారీగా సీసీ రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వేండ్ర, పెదపూడి, కరకుదురు, సంపర, శహపురం, కైకవోలు, పైన గ్రామాల్లో రూ.3.49కోట్లతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. పెదపూడిలో పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సంపరలో పెయ్యా దూడల ఉత్పత్తి పథకం, ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు.

హైఓల్టేజ్ సమస్యకు పరిష్కారం


హైఓల్టేజ్ సమస్య పరిష్కారానికి పనులు చేస్తున్న కార్మికుడు

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: స్థానిక వైఎస్సార్ సీపీ జంక్షన్ సమీపంలో హైఓల్టేజ్ వచ్చిన ప్రాంతాన్ని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ కె.శరత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ, ఏడీ పి.సన్యాసిరావు సోమవారం సందర్శించారు. సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. 'హైఓల్టేజ్‌తో రూ.8 లక్షలు ఆస్తి నష్టం' శీర్షిక‌న సాక్షిలో వచ్చిన వార్తకు స్పందించిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి తాము తీసుకున్న చర్యలను తెలియజేశారు. పై ప్రాంతంలో 74 సర్వీసులు ఉన్నాయని, వాటిలో శివారులో ఉన్న నాలుగు ఇళ్లలోనే హైఓల్టేజ్ కారణంగా నష్టం వాటిల్లిందన్నారు. ఆ ఇళ్లలో ఎర్త్ లేకపోవడం, టీవీ, ఫ్రిజ్, ఏసీల వంటి ఎలక్ట్రికల్ పరికరాలకు ఎంసీబీ, ఆర్‌సీసీబీ వంటి రక్షణ లేకపోవడం ప్రధాన కారణమన్నారు. ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా ప్రస్తుతం ఉన్న ఎల్‌టీ ఏబీ కేబులను 3 స్పాన్లతో మార్చామన్నారు. కార్యక్రమంలో ఏఈ సుధాకర్ పాల్గొన్నారు.